రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



## బెల్టుషాపు నిర్వాహకురాలిపై కేసు నమోదు
## 61 మద్యం బాటిళ్లు స్వాధీనం

**ఘట్‌కేసర్ రూరల్, జూలై 28, ప్రభాతవార్త:** పోచారం మున్సిపల్ అన్నోజిగూడలో అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్న ఓ మహిళ ఇంటిపై పోలీసులు దాడి చేసి 61 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. పోచారం మున్సిపల్ అన్నోజిగూడ లక్ష్మీనర్సింహ కాలనీలో నానావత్ వినోద ( 38 ) అలియాస్ లక్ష్మి ( భర్త రమేశ్) బెల్టు షాపు నిర్వహిస్తూ మద్యం అధిక ధరకు విక్రయిస్తుంది. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు సదరు మహిళ ఇంటిపై దాడిచేసి సోదా చేయగా ఇంటిలో ఓసీ 180 ఎంఎల్ బాటిల్స్ మూడు, డౌన్ టౌన్ 180 ఎంఎల్ బాటిల్స్ 26, ఇంపీయరిల్ బ్లూ 180 ఎంఎల్ బాటిల్ ఒకటి, ఓసీ 90 ఎంఎల్ బాటిల్స్ 31 లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మొత్తం 61 బాటిల్స్ లభ్యం కాగా వాటిని స్వాధీనం చేసుకుని సదరు మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

## మన్‌కీబాత్‌ను వీక్షించిన భాజపా శ్రేణులు


మన్‌కి బాత్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

**కొందుర్గు, జూలై 28, (ప్రభాతవార్త) :** ప్రధానమంత్రి మన్‌కీ బాత్ 112వ ఎ.పి.సోడ్ కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ శ్రేణులు దూరదర్శన్‌లో వీక్షించారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ మండల శ్రాఖ అధ్యక్షులు కోమరబండ శ్రీశైలం నివాసములో భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కమ్మరి భూపాల్‌చారి, అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్ గుప్తా, జిల్లా కార్యవర్గ సభ్యులు చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, కొందుర్గు మాజీ ఎంపీటీసీ కోమరబండ మాణెమ్మతో పాటు వెంకటేష్, చరణ్, భరద్వాజ్, కావలి సత్యమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టులో ఫార్మా భూముల పరిశీలనకై సిఎం పర్యటన

**యాచారం, జూలై 28, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా భూసేకరణ చేపట్టి సంవత్సరాలు గడుస్తున్నా పనులు జరగక రైతులకు భూములు సాగు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో సిఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో పర్యటించి భవిష్యవాణి చెప్పనున్నట్లు తెలుస్తుంది. రైతులకు భూములను సేద్యం చేయలేక ఫార్మాసిటీ ఏర్పాటు కాక అయోమయ పరిస్థితిలో ఉన్నవారికి సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయబోతున్నట్లు తెలుస్తుంది. ఆగస్టు 1న పర్యటన ఉన్నట్లు అధికార వర్గాలు చెప్పుకొస్తున్నారు. రియల్ వ్యాపారానికి ఈ ప్రాంతంలో ఫార్మాసిటీ ఒక గొప్ప అవకాశం ఉన్న సందర్భంలో ఫార్మర్ రద్దుతో రియల్ ఎస్టేట్‌లు అయోమయంలో పడ్డారు. సిఎం రేవంత్‌రెడ్డి మంచి ప్రకటన చేస్తే మళ్లీ పూర్వవైభవం వస్తుందని ఈ ప్రాంత రియల్ వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఫార్మాసిటీ రాకపోయినా సరేకాని ఇక్కడ మంచి సంస్థలు వచ్చి అభివృద్ధి జరగాలని ఆకాంక్షిస్తున్నారు. సిఎం పర్యటన సందర్భంగా అధికార యంత్రాంగం మొత్తం కందుకూరు యాచారం ముచ్చర్ల ఫార్మాసిటీ చుట్టూ తిరుగుతున్నట్లు తెలుస్తుంది. గత మూడు సంవత్సరాలుగా రియల్ వ్యాపారం కుదిలైపోతున్న తరుణంలో రియల్ వ్యాపారంపై అవగాహన ఉన్న సిఎం రేవంత్‌రెడ్డి భవిష్యత్తు కార్యాచరణకు మెరుగులు దిద్దే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండితేనే అన్ని వర్గాలు అభివృద్ధి పదం నడిచేవి నేడు దానికి భిన్నంగా కాడిల పంటల కడిలు పాతి భూములు క్రయ విక్రయాలు జరిగితే అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతున్నట్లు భావిస్తున్నారు. రీజనల్ రింగ్ రోడ్ ఫార్మా బందులుగా ఇతర కంపెనీలు ఏర్పాటు చేస్తే రియల్ వ్యాపారంలో మరింత జోరు అందుకునే అవకాశం ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### బొక్కోనిగూడ, చందుపట్లగూడల్లో బోనాలు


బొక్కోనిగూడలో అమ్మవారిని బోనం సమర్పించిన కౌన్సిలర్ సంగీత ప్రభాకర్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జూలై 28, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా జరుపుకునే బోనాల ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బొక్కోనిగూడ, చందుపట్లగూడలో ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతల ఆలయాలకు రంగులు వేసి పూలు, మామిడి, వేప తోరణాలు, విద్యుత్ లైట్లతో అలంకరించారు. పోచమ్మ, మహంకాళీ, ఎల్లమ్మ, బంగారు మైసమ్మ దేవాలయాలకు భక్తులు వెళ్లి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. బొక్కోనిగూడలో ఘట్‌కేసర్ మున్సిపల్ 3వ వార్డు కౌన్సిలర్ బొక్క సంగీత ప్రభాకర్‌రెడ్డి అమ్మవారికి బోనం సమరి ్పంచారు. భక్తులు బోనాలను తయారు చేసి డప్పు శబ్దాల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయ కులు విచ్చేసి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

### మర్పల్లిలో..

**మర్పల్లి జులై 28 ప్రభాతవార్త :** మర్పల్లి మండల కేంద్రంలో అదివారం నాడు భోనాలపండుగా ను ఘనంగా జరుపూకున్నారు. ఉదయం నుండి పిల్లాపాపల సందడితో పోచ్చమ్మ పేద్దమ్మ మైసమ్మఅమ్మవార్లకు నైవేధ్యాలు సమర్పించారు. డప్పుళ్ల సప్పుళ్లతో పోతురాజు సందడితో చిన్నారుల వేశాదారణలు పలువురిని ఆకట్టుకున్నాయి.భోనాల ఉత్సవాలల్లో పలువురు గ్రామ పెద్దలు, మహిళలు,యువకులు పాల్గోన్నారు.


ఇస్మాయిల్ ఖాన్‌గూడలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న చైర్మన్ బి.కొండల్‌రెడ్డి

## బెల్టుషాపుపై దాడి..అక్రమ మద్యం స్వాధీనం
## ఇద్దరు అరెస్ట్

**ఘట్‌కేసర్, జూలై 28, ప్రభాతవార్త:** అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి మద్యం స్వాధీనం చేసుకున్నామని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదులు తెలిపారు. బోనాల పండుగ సందర్భంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఘట్‌కేసర్ పోలీసులు బెల్టు షాపులపై దాడి చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ చందుపట్లగూడలో పంజాల సందీప్ (30), ఎదులాబాద్ పంచాయతీ పరిధిలోని కొత్తగూడలో బాలబోయిన శ్రీశైలం (40)లు అక్రమంగా మద్యం నిల్వఉంచి అధిక ధరలకు విక్రయిస్తుండటంతో వారిని అదుపులోకి తీసుకొని మద్యం సీజ్ చేశారు. కింగ్‌ఫిషర్ బీర్లు-20, గుడ్‌డే విస్కీ-34 సీసాలను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి ఎస్ఐ శేఖర్ దర్యాప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపారు. బోనాల సందర్భ ంగా మద్యం దుకాణాలు, బార్లు మూసి వేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉండటంతో బెల్టుషాపులో అక్రమంగా మద్యం అమ్మడంతో ఇద్దరిని అరెస్ట్ చేశామని తెలిపారు.



# భక్తి ప్రపత్తులతో అమ్మకు బోనం


గోల్లూరి గూడలో బోనమెత్తిన సునీతారెడ్డి


సాయిబాబా కాలనీల్లో అమ్మవారి ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే శంకర్


బోనమెత్తిన డాక్టర్ దివ్వ

**షాద్‌నగర్, జూలై 28, (ప్రభాతవార్త) :** ఆషాడమాసంలో తెలంగాణ సంస్కృతికి నిదర్శనంగా నిలిచే బోనాల పండగను షాద్‌నగర్ పట్టణంలో పలు కాలనీల్లో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, పట్టణ పురప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలను బోనంగా తయారు చేసుకొని డప్పు వాయిద్యాలతో, ఆటపాటలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయాల్లో సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. పట్టణంలోని సాయిబాలాజీ, సాయిబా బా, అయ్యప్ప కాలనీ, ఆర్టీసీ కాలనీ, భగీరథ కాలనీల్లో నిర్వహించిన ఊరేగింపుల్లో మహిళలు, కాలనీ పెద్దలు, చిన్నారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో హాజరైన పలువురు నాయకులు మాట్లాడుతూ... అనాదిగా వస్తున్న బోనాల పండగను తెలంగాణ రాష్ట్రంలో ఘనంగా నిర్వహించుకుంటారని, ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎంతో భక్తిశ్రద్ధలతో నైవేద్యాలను సమర్పించడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ చరిత్రను చాటిన పండగ ఈ బోనాల పండగ అని అన్నారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా దేశవిదేశాల్లో సహితం ఈ పండగను అంగరంగవైభవంగా జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. గ్రామ దేవతల చల్లని చూపు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని వారు ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీల ప్రజలు, పట్టణ పురప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

### బోన మెత్తిన సునీతమ్మ..

**చేవెళ్ల, జూలై 28, ప్రభాతవార్త** చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలంలోని సునీతమ్మ అత్తారింటింలో ఆదివారం వైభవంగా బోనాల పండుగ జరిగింది. ఈ పం డుగకు ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి మాజీ జడ్పి చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి సొంతింటి నుంచి అమ్మవారికి బోనం ద్వారా నైవేద్యం సమర్పించారు. గ్రామ నాయకులు ఆడపడుచులు సునీతమ్మకు ఘన స్వాగతం పలికారు.

### నర్కుడలో..

**శంషాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** మండలం నర్కుడ గ్రామంలో ఆదివారం బోనాల పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. శంషాబాద్ మండలంలోని పెద్ద గ్రామ పంచాయతీ నర్కుడ గ్రామంలో బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని అన్ని బస్లీలకు చెందిన మహిళలు ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలలో శంషాబాద్ మండల మాజీ జెడ్పిటిసి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నీరటి తన్వి రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆషాడ బోనాల ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని తెలంగాణ రాష్ట్రాన్ని చల్లగా చూడాలని కోరుకున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయ కుడు నీరటి రాజు ముదిరాజ్ అశోక్ ముదిరాజ్ కృష్ణ ముదిరాజ్ కృష్ణముదిరాజ్ శేఖర్ మురిరాజ్ సా ్థనిక నాయకులు పాల్గొన్నారు.

### గగన్‌పహాడ్‌లో..

**శంషాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని గగన్‌పహాడ్‌లో ఆదివారం ఆషాడ మాస బోనాలను వైభవంగా నిర్వహించారు. గ్రామంలో బోనాల వేడుకలను అంగరంగ వైభవంగా సామూహికంగా నిర్వహించారు. వివిధ బస్తీలకు చెందిన మహిళలు ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గగన్ పహాడ్‌కు చెందిన డాక్టర్ పంతంగి దివ్వ తలపై బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు.

**ఉమ్మడి జిల్లాలో ఘనంగా బోనాల పండుగ**
**భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు**

### నందిగామలో కోట్టమైసమ్మకు ..

**నందిగామ, జూలై 28, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రంలో ఆదివారం కోట మైసమ్మ బోనాల పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. మహిళలు యువతులు అందంగా అలంకరించిన బోనాలను భాజా భజంత్రీల మధ్య ఆటపాటల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మో రుతల్లి ఆశీస్సులతో అందరూ చల్లగా ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు సిరిసంపదలతో నిండి పిల్లాపాపలు సంపూర్ణ ఆరోగ్యంతో సుఖ సంతోషాలతో ఉండేలా దీవించమని అమ్మోరు తల్లిని వేడుకున్నారు. ఈ వేడుకల్లో లంకాల శ్రీనివాస్‌రెడ్డి జిల్లెల్ల పెంటారెడ్డి గ్రామస్తులు మహి ళలు పాల్గొన్నారు.

### నందిగామ మండల కేంద్రంలో..

**నందిగామ, జూలై 28, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రంలో ఆదివారం పోచమ్మ బోనాల పండుగ సంబరాలు అంబరాన్ని అంటాయి. స్థానిక అంబేద్కర్ కాలనీలో జరిగిన బోనాల వేడుకలు తాజా మాజీ ఎంపిటిసి చంద్రపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మోరు తల్లి ఆశీస్సులతో అందరూ చల్లగా ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు సిరిసంపదలతో నిండి పిల్లాపాపలు సంపూర్ణ ఆరోగ్యంతో సుఖసంతోషాలతో ఉండేలా దీవించమని అమ్మోరు తల్లిని వేడుకున్నారు. ఈ వేడుకల్లో చెంచేటి కృష్ణగౌడ్ బండ్రపు జంగయ్య గౌడ్ ప్రభయ్య ఏ కుల అంజయ్య ఏకుల రవికుమార్ పబ్బతి కరుణాకర్ పూర్ణం శ్రీకాంత్ బీసా జంగయ్య బీసా నర్సింగ్‌రావు బీసా శ్రీను దార అచలేశ్వర్ దార ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

### మేడ్చల్ జిల్లాలో..

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), జూలై 28, ప్రభాతవార్త** అషాడమాస బోనాల పండుగను గ్రామాల్లో, పట్టణ మున్సిపాల్టీల్లోనూ ప్రాంతాల్లోనూ ప్రజలు ఘనంగ బోనాల పండుగను జరుపుకున్నారు. ఆదివారం మేడ్చల్ జిల్లాలోని వివిధ మండలాల్లో, మున్సిపాల్టీల్లోనూ, గ్రామాల్లోనూ బోనాల పండుగను సాంప్రదాయబద్దంగ ఘనంగ జరుపుకున్నారు. మేడ్చల్ జిల్లా నాచారంలో మహంకాళి సహిత మహాకాళేశ్వరస్వామి దేవస్థానాన్ని డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, భక్తులు, పలువురు మహిళలు ఆదివారం సందర్శించి బోనాలు చేసి సమర్పించి దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు అందజేశారు. ఆలయ పూజారి డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి దంపతులను ఆశీర్వదించారు. దీనిలో ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డి, ఈఓ రమాదేవి, భక్తులు పాల్గొన్నారు. బోడుప్పల్‌లో బోనాల పండుగను పురస్కరించుకుని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు బంగారు మైసమ్మ అమ్మవారిని ఆలయాన్ని సందర్శించి దర్శించుకున్నారు. బోడుప్పల్‌లో జరిగిన బోనాల పండుగలో మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిషోర్‌గౌడ్, అధ్యక్షులు పోగుల నర్సింహ్మారెడ్డి, పలువురు కార్పోరేటర్లు పాల్గొన్నారు.

### శామీర్‌పేట ఉమ్మడి మండలంలో..

తూంకుంట మున్సిపాల్టీలోని గ్రామాలతో పాటు శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ప్రజలు ఘనంగ జరుపుకున్నారు. ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. ఆలయాలు అన్ని బోనాల పండుగతో భక్తిపాటలతో మారమోగాయి. బోనాల పండుగతో ఆలయాలు అన్ని కూడ భక్తులతో కిటకిటలాడాయి. మూడుచింతలపల్లి మండల కేంద్రంలోనూ బోనాల పండుగను గ్రామ ప్రజలు ఘనంగ జరుపుకున్నారు. ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు.


గుండ్ల పోచంపల్లిలో భోనాలతో మహిళల ఊరేగింపు

### మేడ్చల్‌లో..

**మేడ్చల్, జూలై 28. ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. మేడ్చల్ మండలంలో రాయిలాపూర్, డబిల్‌పూర్, గిర్మాపూర్ గ్రామాలతో పాటు మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో పోచమ్మ, మైసమ్మ తల్లులకు నిర్వహించిన బోనాల పండుగలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచే ఆలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. మధ్యాహ్నం నుంచి భోనాల ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

### ఎన్ఎఫ్‌సీనగర్‌లో..

**ఘట్‌కేసర్, జూలై 28, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాల ఉత్సవాలు అద్దం పడుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాద్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలు పోచమ్మ, చిత్తారమ్మ అమ్మవార్లకు ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, వైఎస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డితో పాటు కౌన్సిలర్లు, నాయకులు అమ్మవార్లను దర్శి ంచుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మెడబోయిన వెంకటేశ్, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేసి ప్రజాప్రతినిధులను సన్మానించారు. దేవాలయాలకు రంగులు వేసి పూలు, మామిడి, వేప తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహిళలు పసుపు, కుంకుమ, వేపాకులతో బోనాలను తయారు చేసి డప్పు శబ్దాల మధ్య బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవార్లకు నైవేధ్యం సమర్పించి మొక్కులు తీరు ్చకున్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, కొమ్మగోని రమాదేవి మహిపాల్‌గౌడ్, బొక్క సంగీత ప్రభాకర్‌రెడ్డి, బండారి అంజనేయులుగౌడ్, మాజీ ఎంపిటిసి చిల్కూరి గోపాల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మెడబోయిన వెంకటేశ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, మాజీ వార్డుసభ్యులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, విబి.వెంకటనారాయణ, నాయకులు నార్ల మల్లేశ్‌యాదవ్, యాదగిరిరావు, లింగస్వామి, రాజేశ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

### ఇస్మాయిల్ ఖాన్‌గూడలో..

**ఘట్‌కేసర్ రూరల్, జూలై 28, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ పరిధిలోని ఇస్మాయిల్ ఖాన్‌గూడలో తెలంగాణ సంస్కతి సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పోచమ్మ, మైసమ్మ తదితర అమ్మవార్లకు నైవేద్యం వండి బోనాల ఊరేగింపుతో అమ్మవారికి సమర్పించి మ్రొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో జరిగే బోనాల ఉత్సవాలకు మున్సిపల్ తరపున అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. మున్సిపల్ ప్రజలు ఆయురోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ బీజేపీ నాయకుడు గొంగళ్ల మహేశ్ కురుమ, నాయకులు అచ్చిని నర్సింహ, ఆంజనేయులు, రమేశ్, సురేశ్, ప్రవీణ్, ఈగ మధు, కృష్ణారెడ్డి, శ్రీశైలం, హరికృష్ణ, బద్రీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్ జిల్లాలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు


షాబాద్ మండలంలోని హైతాబాద్ గ్రామంలో పోచమ్మ ఈదమ్మ బోనాల ఉత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఎలగంటి మధుసూదన్‌రెడ్డి, కావలి చంద్రశేఖర్ తదితలు


బోనమెతుకున్న మాజీ జెడ్పిటిసి తన్వి రాజు


నందిగామలో అంబేద్కర్ కాలనీ నుంచి ఊరేగింపుగా వెళ్తున్న బోనాలు


ఎన్ఎఫ్‌సీనగర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్, వైఎస్ చైర్మన్ మాధవరెడ్డి తదితరులు

# పాతనగరంలో వైభవంగా బోనాల జాతర ఉత్సవాలు



అమ్మవారికి ప్రభుత్వం పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి కోమటిరెడ్డి



పూజలు నిర్వహించిన కేంద్రమంత్రి, గవర్నర్..



పూజలునిర్వహించిన జిహెచ్ఎంసి మేయర్ విజయలక్ష్మి

**చార్మినార్, జూలై 28 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో ఆదివారం అత్యంత వైభవం గా ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు జరిగాయి. బోనాల జాతర ఉత్సవాలు సంద ర్భంగా పాతనగరం లోని చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరం,మీరాలంమండి శ్రీమహంకాళేశ్వర మందిరం, శ్రీఅక్కన్న మాదన్న శ్రీ మహంకాళి మందిరం, కసారట్ట శ్రీనల్ల పోచమ్మ మంది రంతోపాటు పలుదేవాలయాలను అందంగా తీర్చిదిద్దారు. బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని జిహెచ్ ఎంసి, విద్యుత్, రెవెన్యూ, జలమండల శాఖల అధికా రులు పాతనగరంలో అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రభుత్వం తరుపున చార్మి నార్ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పిం చారు. హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి మందిరంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ పాతబస్తీ మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర మందిరంలో పూజలు నిర్వహించారు. కాగా రాష్ట్ర మం త్రులు బట్టి విక్రమార్క,పొన్నం ప్రభాకర్, దేవా దాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్‌తో పాటు పలువురు ప్రముఖులు చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో అమ్మ వారికి పూజలు, అభిషే కాలు జరిపారు.

పాతబస్తీలోని అన్ని శ్రీ మహంకాళీ దేవాలయాలలో అమ్మ వార్లకు మహిళలు అత్యంత భక్తి శ్రద్దలతో బోనాలు సమర్పించారు.

పాతబస్తీలో ఆదివారం జరిగిన బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# బోనమెత్తిన భాగ్యనగరం

**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్**

**చాంద్రాయణగుట్ట, జూలై 28 ప్రభాతవార్త :** పాతనగరంలో ఆషాడమాసం చివరిఆదివారం బోనాల జాతర సంబు రాలు అంబరాన్నంటాయి. బొట్ల బొట్ల బోనాలు, శివసత్తి, పోతరాజుల నృత్యాలు, డప్పుదరువులు, బ్యాండ్ మేళాలు, వేషాధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వచ్ఛంద సంస్థల ఆహ్వానాలతో పాత నగరంలో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు అద్ధం పట్టే లాల్‌దర్వాజ శ్రీసింహవాహిణి మహంకాళి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిగాయి. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించ డానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సినీ ప్రముఖులు, ప్రత్యేక పూజల మధ్య బోనాల జాతర ఉత్సవాలు భక్తుల కోలాహలం మధ్య వైభవంగా కొనసాగింది. ఆడపడుచులు తలపై బొట్ల బొట్ల బోనాలను పాత్రలతో అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. పాతబస్తీలోని ఆయా దేవా లయాల వద్ద కమిటీ ప్రతినిధులు మహిళల కోసం ప్రత్యేకంగా క్యూలైన్‌లు, భారీ కేడ్లలను ఏర్పాటు చేశారు. అన్ని దేవాలయాలలో ఉదయం 6 గంటల నుంచే అమ్మ వారికి బోనాలను సమ ర్పించడానికి మహిళలు బారులు తీరి భక్తిశ్రద్దలతో నైవేద్యం సమర్పించారు. పోలీసులు సిసి కెమరాలు అడుగడుగునా ఉంచి ప్రత్యేక బందో బస్తును ఏర్పాటు చేశారు. పాతబస్తీ లాల్‌దర్వాజలోగల చారిత్రాత్మక శ్రీ సింహ వాహిణి మహంకాళి అమ్మవారికి ఉదయం మాజీ హోంశాఖమాత్యులు దేవేందర్‌గౌడ్ కుటుంబసభ్యులచే అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆనవాయితీగా వస్తున్న తొలిబోనం సమర్ప ణను మాజీ మంత్రి దేవేందర్ గౌడ్ కుటుంబసభ్యులు అమ్మవారికి తొలిబోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క, రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైకోర్టు జడ్జి సూర్యపల్లి నంద, దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యర్ అమ్మ వారికి బంగారు బోనం సమర్పించారు. పాతబస్తీలోని ఏడు ప్రధానమైన దేవాలయాలలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వెంకట్రామ్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు, దేవాదా యశాఖ కమిషనల్ హనుమంత్ రావు తదితరులు సింహవాహిణి మహం కాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరవా సులు పాతబస్తీలోని అన్ని దేవాలలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మ వార్లకు బోనాలు సమర్పించి అందరిని చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఆలయాలకు చేరుకున్న ప్రముఖులను ఆలయ కమిటీ ప్రతినిధులు రాజేందర్ యాదవ్, అరవింద్ గౌడ్, కె.వెంకటేష్, మారుతీయాదవ్, సతీష్ ముదిరాజ్, శీరా రాజ్‌కుమార్ వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## మహంకాళీ అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు

**హైదరాబాద్, జూలై 28 ప్రభాతవార్త:** బోనాలు పండువను పురస్క రించుకుని ఆదివారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బింబోలి అడ్డలోని శ్రీమహాంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతికగా బోనాలు పండుగ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేందర్‌పటేల్, సుభాష్‌పటేల్, కార్పోరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్, కె.నర్సింగ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో జరిగే గొప్ప వేడుక బోనాలు

**-కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, జూలై 28 ప్రభాతవార్త:** దేశం ఎక్కడా లేని విధంగా భాగ్యనగరంతో పాటు తెలంగాణలోని మారుమూల ప్రాంతాల్లో గ్రామాల్లో జరిగే గొప్ప వేడుక బోనాలు పండుగ అని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బోనాలు పండుగ సందర్భంగా ఆదివారం అంబర్ పేట మహాంకాళీ అమ్మవారి ఆలయాన్ని జి.కిషన్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రకృతి వైపరీత్యాలు, విషజ్వరాలు రాకూడదని, మంచి వర్షాలతో, పాడి పంటలతో అందరూ ఇబ్బందులు లేకుండా అమ్మవారిని కోరుకునే పండుగ అని అన్నారు. ఇది ముఖ్యంగా మహిళల పండుగ అని, ధనిక, పేద అని తేడా లేకుండా అన్నివర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి బోనం చేసి దేవాలయాల్లో అమ్మవారిని దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారని అన్నారు.

## బోనాల వేడుకల్లో పాల్గొన్న మంత్రి



మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఉపమేయర్ బాబాఫసియుద్దీన్

**యూసుఫ్‌గూడ, జూలై 28, ప్రభాతవార్త :** పండుగ పర్వదినాలను శాంతి యుతంగా జరుపుకోవాలని రవాణా శాఖ, బీసి సంక్షేమ సంఘం మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆషాడం బోనాలు పురస్కరించుకుని బోరబండ చౌరస్తాలోని శ్రీపోచమ్మ దేవాలయంలో గ్రేటర్ మాజీ ఉప మేయర్, బోరబండ కార్పోరేటర్ బాబాఫసియుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన బోనాల పండుగ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్,తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్,నగర మేయర్ విజయలక్ష్మీ, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ రోహిన్ రెడ్డి, రహ్మత్‌నగర్ కార్పోరేటర్ సి.ఎన్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా జోగిని శ్యామల, ప్రముఖ సింగర్ మధుప్రియలు కూడా పాల్గొన్నారు.

## అమ్మవారికి పూజలు చేసిన ఎమ్మెల్యే

**యూసుఫ్‌గూడ, జూలై 28, ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా బోనాల ఉత్సవాలను జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రామారావునగర్, శివబస్తీ, లక్ష్మీనగర్, గాయత్రినగర్, వివేకా నందనగర్, బస్తీలలో అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్ల ఆశీర్వాదాలు పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు లింగాల ఆయిలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, నాగుల సత్యం, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, రోనంకి జగన్నాధం, సంజీవరెడ్డి, కాయితీ యాదవరెడ్డి, కలవల ఏడుకొండలు, పులిగోళ్ళ శ్రీనువాస్‌యాదవ్, గుత్తికొండ రామకృష్ణ, వెంకటేశ్వరరావు, కేశవరావు, బొల్లి శ్రీనువాస్, మల్లేష్, వెంకటయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# కనుల పండువగా బోనాల ఉత్సవాలు



పోచమ్మకు ఘటాలను సమర్పించేందుకు వెళ్తున్న డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, గ్రామ పెద్దలు

**నార్సింగి, జూలై 28 ప్రభాతవార్త :** గండిపేటమండలంలో బోనాల వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. భక్తులు, పుర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు అంతా కలిసి వైభవంగా బోనాల పండుగను జరుపుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు మహిళలు తలంటు స్నానాలు చేసి, కొత్త బట్టలు ధరించి, పిండి వంటలు చేసుకొని బోనాలతో వచ్చి అమ్మవార్ల ఆలయాలలో ముడుపులు సమర్పించుకున్నారు. మట్టి కుండకు పసుపు, కుంకుమలతో అందంగా బొడ్లుపెట్టి, వేపా కులు, నువ్వుల నూనెతో వెలిగించిన జ్యోతులను తలపై పెట్టుకొని అమ్మవారి లీలలను స్తుతిస్తూ ఆలయాలకు వెళ్లారు. ఘటాల ఊరేగింపులో రాజ కీయ నాయకులు పాల్గొని భక్తులలో ఉత్సాహాన్ని పెంచారు. డప్పుల దరువుకు అనుగుణంగా శివ సత్తులు, పోతురాజులు చేసిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముంగి జైపాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం లో వచ్చే అంటువ్యాధుల నుంచి రక్షణ పొందేం దుకు శతాబ్దాలుగా బోనాల వేడుకలను చేయడం సాంప్రదాయంగా వస్తుందన్నారు. ఈ వేడుకల్లో వాడే ప్రతీ పదార్థం వ్యాధు లను వ్యాపింపచేసే వైరస్‌లు, బ్యాక్టీరియాలను నాశనం చేసేవే ఉన్నా యన్నారు. పూర్వీకులు, ఋషులు హిందూ ధర్మం లో చేసే ప్రతీ పర్వదినం లో ఆరోగ్య రహస్యంను ఉంచారని తెలిపారు.పంచభూతాలను పూజించడం, ప్రకృతి సిద్దంగా జీవించడం ఆనవాయితీగా మార్చారని తెలిపారు. ఎన్ని యుగాలు మారినా, తరాలు మారినా సనా తన ధర్మ ఆచారాలు పాటిస్తే సమస్యలన్నింటి నుంచి ఉపశమనం పొందుతామ న్నారు. బండ్లగూడ, నార్సింగి, మణికొండ మున్సి పాలిటీల పరిధుల్లోని అన్ని గ్రామాల్లో ఆదివారం అమ్మవార్ల దేవాలయాలు బోనాల వేడుకలతో కిటకిటలాడాయి. ఆలయాల నిర్వాహకులు సైతం భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసి భక్తుల ప్రశంసలు అందుకున్నారు. కొన్ని ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు సైతం నిర్వహించారు.

## మంత్రి వెంకటరెడ్డికి హరీష్‌రావు క్షమాపణ చెప్పాలి

**సైఫాబాద్, జూలై 28 ప్రభాతవార్త:** మంత్రి పదవిని తృణపాయంగా వదిలేసి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఆమరణ నిరాహారదీక్ష చేసిన తెలంగాణ రాష్ట్ర గుండెచప్పుడు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై అగ్గిపెట్టే దొరకని మాజీ మంత్రి టి.హరీష్ రావు చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవా లని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్నగౌడ్ డిమాండ్ చేశారు. ఆయన బేషరుతుగా మంత్రికి క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో రాష్ట్రంలో ఎక్కడ తిరిగినా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆదివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజలకోసం తపించే వ్యక్తి కొమిటిరెడ్డి వెంకటరెడ్డి అని ఎంతో మంది పేద విద్యార్థులకు విద్య, వైద్యం అందిస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని సైతం త్యాగం చేసి, తెలంగాణ రాష్ట్రం వచ్చే దాకా మంత్రి పదవిని స్వీకరించనని శపదం చేశారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసి డబ్బులు సంపాదించుకుని, రాష్ట్రం వచ్చిన తరువాత భారీగా అవినీతికి పాల్పడిన టి.హరీష్‌రావుకు వెంకటరెడ్డిని విమర్శించే హక్కులేదన్నారు. తక్షణమే వెంకటరెడ్డికి హరీష్‌రావు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## పాతబస్తీని గోల్డ్ సిటీగా మార్చేందుక ప్రభుత్వం కృషి

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**చార్మినార్, జూలై 28 ప్రభాతవార్త :** ఎన్నికల్లో పోటీ చేసిన సగం సీట్లలో డిపాజిట్లు రాని బిఆర్ఎస్ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత బెటర్ అని రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.ఆషాడ మాసం బోనాలు సందర్భంగా ఆదివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దంపతులు చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ప్రభుత్వం తరుపున కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతబస్తీని గోల్డ్ సిటీగా మార్చేందుకు ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని తెలిపారు.పండుగ రోజున రాజకీ యాలు గురించి మాట్లాడటం మంచిది కాదని,బిఆర్ఎస్ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత బెటర్ అని ఆయన తెలియజేశారు.పాత డిజైన్‌తో కొత్తగా ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తామని ఆయన తెలిపారు.

## ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి : ఎమ్మెల్యే

**యూసుఫ్‌గూడ, జూలై 28, ప్రభాతవార్త:** ప్రజలంతా సుఖసంతోషాలతో విరజిల్లాలని జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ ఆకాంక్షించారు. ఆదివారం ఆషాడ బోనాలు సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు బస్తీల కాలనీలలోని అమ్మవార్ల ఆలయాలను సందర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో శ్రీరాజరాజేశ్వరి ఆలయం చైర్మన్ యి.నర్సింగరావు, రామకృష్ణ, రేణు, కిరణ్మయి, రాఘవ, ఉప్పలయ్య, శ్రీధర్‌పంతులు, రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీభూలక్ష్మి దేవాలయంలో బోనాల వేడుకలు

**బేగంపేట జూలై 28,ప్రభాతవార్త :** బేగంపేట ప్రకాశం నగర్ లోని శ్రీభూ లక్ష్మి దేవాలయంలో ఆదివారం ఆషాడ బోనాల ఉత్సవాల వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు బోనాలతో వచ్చి అమ్మ వారికి బోనాలు సమర్పించారు. ఉదయం గం5లకు అమ్మ వారి మూల విరాట్ కు పంచామృత, హరిద్రోదక కుంకుమ సహిత అభిషేకం చేసారు.గం 6లకు నూతన వస్త్ర అలంకరణ,గం 7లకు అమ్మ వారికి బోనాల సమర్పణ కార్య క్రమం ప్రారంభమైంది. మధ్యాహ్నం గం 12లకు మహానైవేద్యం మహా మంగళ హారతులు,గం 6.30తొట్టెల ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. పోతురాజుల విన్యాసాలు అలరించాయి.ఈ సందర్భంగా ఆదివారం అమ్మ వారిని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ దర్శించుకుని పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్మాణ దాత విశాల్ సూథం తెలియజేసారు. 29 ఆలయ ప్రాంగణంలో రంగం కార్య క్రమం, అనంతరం గావు కార్యక్రమాలు ఉంటాయని,భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మ వారి కృపకు పాత్రులు కావాలని విశాల్‌సూథం,ఆలయ ఈ ఓ వితలయ్యలు కోరారు. ఈ సందర్భంగా ఎల్లయ్య, కృష్ణ, తుకారాం, వెంకటేష్, గోపాల్, అశోక్, సాయి, గోవిందరావు, సత్యనారాయణ, శేఖర్,నర్సింహ, లక్ష్మీనారాయణ, ధీరజ్ ,రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయ జానపద కళలకు వేదిక కల్పిస్తాం

**చిక్కడపల్లి, జూలై 28 ప్రభాతవార్త:** మరుగున పడిపోతున్న సంప్రదాయ జానపద కళలను తమవంతుగా పరిరక్షించేందుకు త్యాగరాయ గానసభ కార్యవర్గం నిర్ణయించిందని గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం గతించిన జాతీయ స్థాయి తెలుగు మహనీయులను స్మరిస్తూ వారి జయంతులు నిర్విరామంగా ఆరు సంవత్సరాలుగా నిర్వ హిస్తున్నామని వివరించారు. చరిత్ర పుటల్లో మిగిలిన అనేక మంది సాహితీ వేత్తలు, సామాజికవేత్తలు, ఉద్యమకారులు, రాజకీయరంగ మహనీయుల యాదిలో పేరిట సంస్మరించే కార్యక్రమాలు నెట్ ద్వారా వీక్షిస్తున్న విదేశీ తెలుగువారు సైతం గానసభ చేస్తున్న యజ్ఞతుల్య కార్యక్రమాలకు అభి నందనలు తెలుపుతున్నారన్నారు. అదే క్రమంలో మరుగున పడిపోతున్న హరికథ, ఒగ్గుకథ, బుర్రకథ, చిందుయక్షగానం, పద్య పౌరాణిక నాటకం, సాంఘికనాటకం, శాస్త్రీయ జానపద కళలు, మిమిక్రి, మేజిక్ వంటి వైవిధ్య భరితమైన కళలకు గానసభలో ఆరు హాల్స్‌లో ఒక హాల్‌ను నెలలో ఒక రోజు ఒక కళకు అలా 365 రోజులు ఉచితంగా కేటాయించడంతో పాటు ఆరవైవేల మంది దేశవిదేశాల్లో వీక్షకులున్న గానసభ టీవీ 1966, ట్రైనెట్‌లైవ్‌లో ఉచితంగా ప్రసారం చేస్తామన్నారు. ఆయా కళల్లో ప్రతిభావంతులు తమ ప్రదర్శనలకు వేదిక కోసం గానసభ అధ్యక్షుడు సెల్ 9399920008 ద్వారా వివరాలు తెలుసుకోవచ్చన్నారు. విలేకరుల సమావేశంలో కార్యవర్గసభ్యులు అవధాని, జర్నలిస్ట్ శంకరనారాయణ, తాళ్ళపల్లిచక్రపాణి, బండి శ్రీనివాస్, గుండవరపు గీతాదేవి పాల్గొన్నారు.



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, విజయలక్ష్మి

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు బోనాలు ఉత్సవాలు : వెంకయ్యనాయుడు

**చిక్కడపల్లి, జూలై 28 ప్రభాతవార్త:** బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం రామ్‌నగర్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ నివాసంలో జరిగిన బోనాలు ఉత్సవాలకు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ ప్రజలకు బోనాలు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరు సుఖసంతోషా లతో ఉండాలని కోరుకుంటునానని చెప్పారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి కుమార్తెలు జశోధర,వేదాన్షీ పాటలు పాడి వెంకయ్యనాయుడి నుంచి ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఆర్యూరు, ముషీరాబాద్ ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, ముఠాగోపాల్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, పూర్వ ఎమ్మెల్సీ రామచంద్రరావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు, శ్యామ్‌సుందర్‌గౌడ్, మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్‌జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, బిజెపి నేత కన్నెరమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు ఓటములను పాజిటివ్‌గా తీసుకోవాలి

**హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్రీసుధ**

**చిక్కడపల్లి, జూలై 28 ప్రభాతవార్త:** కోర్టులలో కేసులకు సంబంధించి వాదోపవాదాల తర్వాత కేసుల గెలుపోటములను న్యాయవిద్యార్థులు పాజి టివ్ దృక్పథంలో సమానంగా తీసుకోవాలని తెలంగాణ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ పి.శ్రీసుధ అన్నారు. ఆదివారం రెండు రోజుల పాటు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ లా కళాశాల ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలో నిర్వహిం చిన కాకా వెంకటస్వామి మెమోరియల్ మూట్‌కోర్టు పోటీల ముగింపు సభకు జస్టిస్ శ్రీసుధ హాజరై ప్రసంగించారు. న్యాయ కళాశాల యాజ మాన్యాలు న్యాయవిద్యను అభ్యసించే విద్యార్థులకు కళాశాల స్థాయిలో నిర్వహించే మూట్‌కోర్టు పోటీలు వారికి భవిష్యత్తులో వృత్తిపరంగా ఎంత గానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల చైర్మన్, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, కార్యదర్శి, బెల్లంపల్లి ఎమ్మెల్యే జి.వినోద్, సంయుక్త కార్యదర్శి రమణ, డైరెక్టర్ రిషికాంత్, ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్‌లు జిబి.రెడ్డి, మహేంద్ర కుమార్ బండారి, వర్సిటీ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధికా యాదవ్, డాక్టర్ ప్రొఫెసర్ కెవిఎస్.శర్మ, లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సృజన, వైస్‌ప్రిన్సి పాల్ పివి.రామచంద్రరావు, లా కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డికి ఘన నివాళులు

**బేగంపేట జూలై 28, ప్రభాతవార్త :** మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని స్ఫూర్తిస్థల్‌లో ఆది వారం ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కల్సి నివాళులర్పించారు. ముఖ్యమంత్రితో పాటు శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి,మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్,రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్,ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి,మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, జయపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు జైపాల్‌రెడ్డికి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.



జూపాల్ రెడ్డికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి తదితరులు

# నగరంలో గుప్పుమంటున్న గంజాయి...

**గుప్పుమంటున్న గంజాయి...**
**ఎక్సైజ్ శాఖకు సవాల్‌గా మారుతున్న స్మగ్లర్లు**
**దాడులు చేస్తున్నా ఆగని అమ్మకాలు...**
**ఆదివారం రెండు కేజీలకు పైగా స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం..**

**పంజగుట్ట, జూలై 28 (ప్రభాతవార్త):** నగరంలో గంజాయి వాసనలు గుప్పుమంటు న్నాయి. ఎన్ని దాడులు చేసినా, ఎన్ని చెక్ పోస్టులు పెట్టినా గంజాయి స్మగ్లర్లు ఏదోవిధం గా గంజాయి రవాణా చేస్తూ అధికారులకు సవాల్ విసురుతు న్నారు. పోలీసు, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభా గాలతో సహా ఇతర శాఖల అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నా గంజాయి రవాణా, అమ్మకాలు తగ్గక పోవడంతో అధికార యంత్రాంగం మరింత అప్ర మత్తంగా ఉండాలని ప్రభుత్వం నుండి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు వెలువడ్డాయి. గంజాయికి హబ్‌గా ఉన్న ధూల్‌పేటలో అధికారులు వరుస దాడులు చేయడంతో స్మగ్లర్లు నగరాన్ని తమకు అనువైన చోటుగా ఎన్నుకున్నట్లు ఓ ఎక్సైజ్ అధి కారి వెల్లడించారు. ముఖ్యంగా నగరంలోని అన్ని ప్రాంతా లకు గంజాయి రవాణా అయి అమ్మకాలు జరు గుతున్నా జూబ్లీహిల్స్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి లోనే ఎక్కువగా రవాణా, అమ్మకాలు జరుగు తున్నట్లు అధికారులు భావించి ఆ దిశగా నియంత్రణ చర్యలు చేపట్టడంతో కొంతమేర సత్ఫలితాలు సాధించినట్లు సమాచారం. ఈ వారంలోనే వెంకటగిరి ప్రాంతంలో ఇరువురు వ్యక్తులు గంజాయి అమ్ముతుండగా జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీసులు వారిని అదుపులోకి తీసు కుని వారి నుంచి 300 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆది వారం బోనాలు కావడంతో అధికార యం త్రాంగం అంతా బోనాల విధుల్లో ఉంటారని భావించి పెద్ద ఎత్తునధూల్‌పేట నుండి జూబ్లీహిల్స్, బంజారా హిల్స్ ప్రాంతాలకు గంజాయి రవాణా అయ్యే అవ కాశం ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో జూబ్లీహిల్స్ ఎక్సైజ్ సిబ్బంది మొత్తం తమ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించడంతో పాటు అను మానిత ప్రాంతాలను వదలకుండా గాలింపు చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు తాళాలు వేసి మరీ సిబ్బంది మొత్తం గంజాయి అక్రమ రవాణాను అరికట్టడానికి రంగంలోకి దిగా రంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకో వచ్చు. మొత్తం మీద ఆది వారం సాయంత్రానికి జూబ్లీహిల్స్ ఎక్సయిజ్ పోలీసులకు రెండు కేజీలకు పైగానే డ్రై గంజాయి దొరికినట్లు విశ్వసనీయ సమాచారం.

నగరంలో జూబ్లీహిల్స్, బంజారా హిల్స్ ప్రాంతాలు ఒక ప్రత్యేకమైనవిగా ఉంటాయి. ఇక్కడ అత్యంత ధనవంతులు, పక్కనే అత్యంత పేద వారు నివశిస్తూ ఉంటారు.ధనవంతుల ఇళ్లలో సోదాలు చేయలేము, పేదవారు నివశించే మురికి వాడలలోకి వెళ్లలేమని ఓ అధికారి ఆవే దన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్ ప్రాంతా లలో ఓ వైపు పబ్‌లలో డ్రగ్స్ విలయ తాండవం చేస్తుండగా మరోవైపు మురికి వాడలలో గంజాయి వాసనలు గుప్పు మంటుండడంతో అధికార యం త్రాంగానికి కంటిమీద కునుకే కరువైంది.

# యువకుడి దారుణ హత్య

**సంజీవ్‌రెడ్డి నగర్, జూలై 28, ప్రభాతవార్త :** ఎస్సార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ హాస్టల్‌లో దారుణ హత్య కలకలం రేపింది. ఎస్సార్ నగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. హనుమ హాస్టల్‌లో కర్నూల్ జిల్లా ఆలమూరు గ్రామ నివాసి వెంకటరమణ ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యా యుడు ఉంటున్నాడు. అతనితోపాటు ఉండే బార్బర్ గణేష్ మధ్య కొంత కాలంగా విభేదాలు నడుస్తున్నాయి. గణేష్ రోజు మద్యం సేవించి వచ్చి నిద్రకు ఆటంకం కలిగిస్తున్నందున ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి తీవ్ర ఘర్షణకు దిగారు. దీంతో కోపం పెంచుకున్న గణేష్ తన కటింగ్ షాప్‌లో ఉప యోగించే కత్తితో దాడి చేసి వెంకటరమణను హత్య చేశారు. రక్తపు మడుగులో వెంకటరమణ అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సార్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తండ్రి కొడుకుల మధ్య ఘర్షణ...తండ్రి మృతి

**మైలార్‌దేవ్‌పల్లి, జూలై 28 ప్రభాతవార్త :** తండ్రి కొడుకుల మధ్య జరిగిన గొడవలో తండ్రి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నరేందర్ కధనం ప్రకారం..ప్రగతి కాలనీలో నివాసం ఉంటున్న కిష్టప్ప (52) దంపతులు కొడుకు మహేందర్ (23)తో కలిసి ఉంటున్నారు.శనివారం రాత్రి తండ్రి కొడుకులిద్దరు మద్యం సేవించారు.తాగిన మైకంలో వారి మధ్య గొడవ జరిగింది.కోపంలో కొడుకు మహేందర్ తండ్రి కిష్టప్పను నెట్టి వేశాడు.కింద పడిన కిష్టప్ప మృతి చెందాడు.పోలీసులు మహేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్టీ కార్పొరేషన్‌కు జీవం పోయండి

### జిల్లా ఎల్‌హెచ్‌పిఎస్ అధ్యక్షుడు ఊమ్లా నాయక్

**శంషాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** నిర్వీర్యంగా మారిన ఎస్టీ కార్పొరేషన్‌కు తగిన నిధులు విడుదల చేసి తిరిగి జీవం పోయాలని రంగారెడ్డి జిల్లా లంబాడా హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఉమ్లానాయక్ డిమాండ్‌చేశారు. రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్‌కు గత కొని న్న సంవత్సరాలుగా అటు రాష్ట్ర ప్రభుత్వం గానీ ఇటు కేంద్ర ప్రభుత్వంగాని నిధులు విడుదల చేయకపోవడంతో విద్యావంతులైన గిరిజన యువతి యువకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యావంతులైన ఎస్టీ యువతియువకులకు స్వయం ఉపాధి పథకాల కోసం ఎస్టీ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకోగా ఆర్థిక సంక్షోభంలో ఉన్న కార్పొరేషన్ నిరుద్యోగులను గాలికి వదిలేసిందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడంతో ఈ కార్పొరేషన్ ఉన్న ప్రయోజనం లేకుండా మారిందని ఊమ్లానాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని ఎస్టీ కార్పొరేషన్కు తగిన నిధథలు విడుదల చేసి యువతి యవకులను ఆదుకోవాలని ఊమ్లానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సెక్యూరిటీ వ్యవస్థ బలోపేతం చేస్తాం: హరిప్రసాద్‌రావు



కాలనీ సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ హరిప్రసాద్‌రావు

**ఘట్‌కేసర్ రూరల్, జూలై 28, ప్రభాత వార్త:** సంస్కృతి టౌన్‌షిప్‌లో సెక్యూరిటీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని సమావేశంలో చర్చించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు, స్థానిక కౌన్సిలర్ బి. హరిప్రసాద్ రావు తెలిపారు. పోచారం మున్సిపల్ సంస్కృతి టౌన్‌షిప్‌లో ఆదివారం కాలనీ సభ్యులతో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సమావేశం నిర్వహించారు. కాలనీలో శాంతి భద్రతలతో పాటు ఇంటి యాజమానుల ఆస్తుల రక్షణకు సమూలంగా సెక్యూరిటీ వ్యవస్థను బలోపేతం చేయాలని సభ్యులు కోరారు. మున్సిపల్ నిధులు 30 లక్షలతో అతి తొందరలోనే దుకాణాలు ఏర్పాటు చేసే పనులు ప్రారంభం చేయాలని చర్చించినట్లు తెలిపారు. ఇంటి యాజమానులు తమ ప్లాట్లను అద్దెకు ఇచ్చే విషయంలో రెంటల్ కంపెనీలకు అప్పగించాలని తీర్మానించినట్లు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు కౌన్సిలర్ అయిన బి. హరిప్రసాద్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి, సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారి భగవాన్, సభ్యులు మెట్టు నర్సింహ రెడ్డి, బద్దం వెంకట్ రెడ్డి, మంజుల కొండయ్య, ప్రగతి, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

## అధికారం మారినా.. పార్టీలు మారిన మండంలో మారని రోడ్లు

### బిజెపి మండల కార్యదర్శి గుమ్మాల సీతారాంరెడ్డి



**మొయినాబాద్,జూలై 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారం మారిన నియోజకవర్గంలో ఎమ్మెల్యే పార్టీ మారిన మా మండలంలో రోడ్ల పరిస్తితి మాత్రం మారలేదని అన్నారు. మొయినాబాద్ మండలంలో గ్రామాలకు వెళ్లేటువంటి రోడ్ల పరిస్థితి మాత్రం మారలేదని మొయినాబాద్ బిజెపి మండల కార్యదర్శి గుమ్మాల సీతారాంరెడ్డి అన్నారు. మండలంలోని మొయినాబాద్ చౌరస్తా నుంచి వెంటాపూర్ వెళ్లే శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు ప్రధాన దారి అయినటువంటి రోడ్డు అధ్వానంగా మారిందని తూతూ మంత్రంగా మొయినాబాద్ నుంచి సురంగల్ వరకు వేసిన రోడ్డు ఆరు నెలలు తీరగకుండానే అస్తవ్యస్తంగా మారి గుంతలు ఏర్పడ్డాయని సురంగల్ నుంచి వెంకటాపూర్ వరకు ప్రయాణికులకు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని ఆయన అన్నారు. అదికారులు వెంటను స్పందించాలని ఆయన కోరారు. రాకపోకలకు నిత్యం గ్రామస్తులు పడుతున్నటు వంటి ఇబ్బందులను గమనించి సీతారాంరెడ్డి రోడ్డుకు సుమారు 45 ట్రిప్పుల ట్రాక్టర్ మొ ర్రం మట్టిని సొంత డబ్బులతో పోయించి మరమ్మతులు చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో యవకులు పోతుల ప్రభుయాదవ్ చేకూరి మధుగౌడ్ కందికొండ ప్రశాంత్‌గౌడ్ వినాయకరెడ్డి సోమకుమార్ యాదవ్ ఎలుగని భూషన్‌గౌడ్ జావోజి రాజేష్ హరీష్ రాఘవేందర్‌గౌడ్ నరేష్ శ్రీనివాస్ కిట్టు శ్రీధర్ మధు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పూలమొక్కలతో వనదుర్గమ్మకు అలంకరణ

### -అమ్మవారికి భక్తుల ప్రత్యేక పూజలు



భక్తుల పూజలందుకుంటున్న ఏడుపాయల వనదుర్గామాత దృశ్యం

**పాపన్నపేట, జూలై 28, ప్రభాతవార్త:** ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని చివరి ఆదివారం ఏడుపాయల వనదుర్గా మాత ఆలయ భక్తులతో కిక్కిరిపోయింది. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఆలయ పరిసరాలు అమ్మవారి నామస్మరణతో మారుమ్రోగాయి. ఆలయంలో ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం నిర్వహించి రక రకాల పూలమొక్కలతో అమ్మవారిని దనదుర్గాదేవి రూపంలో అందంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు తమ మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీర పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాలు సమర్పించి ఒడిబియ్యం, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మ, మురళీధర్, రాజశేఖర్‌లు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అమ్మవా రి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయ కమిటి చైర్మన్ సాతెల్లి బాలగౌడ్, ఆలయ ఈఓ కృష్ణ ప్రసాద్, ఆలయ సిబ్బంది రవి కుమార్, సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, నర్సింలు, వరుణాచారి, భత్తిని రాజు, యాదగిరి, శ్రీకాంత్‌లు తగు ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ నరేష్ తన సిబ్బందితో ఆలయ పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.



ఫారెస్ట్ అధికారులకు జింకను అప్పగిస్తున్న రైతులు

## జింకను అధికారులకు అప్పగించిన రైతులు

**యాచారం, జూలై 28, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో జింకను గుర్తించిన రైతులు ఫారెస్ట్ అధికారులక ఆదివా రం అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు పంబాల యాదయ్య వ్యవసాయ పొలంలో గడ్డిమడిలో జింకను కుక్కలు వెంబడిస్తుండగా ఆయన గుర్తించి జింకను రక్షించారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అధికారులు తక్షణమే సంఘ టన స్థలానికి వచ్చి జింకను వైద్య పరీక్షలనిమిత్తం యాచారంలోని వెటర్నరీ హాస్పిటల్‌కు తరలించారు. వెంటర్నరీ అధికారి రేఖ అందుబాటులో లేకకపోవడంతో వెటర్నరీ సహాయక సిబ్బందికి సూచనలు చేశారు. జింకకు వైద్యం అందించి జూకు తరలిస్తున్నట్లు తాడిపర్తి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మహమ్మద్ షరీఫ్ పేర్కొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం



**ఆదిభట్ల, జూలై 28, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం మండల శేరిగూడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2007-08 బ్యాంచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన ఆదివారం మంగల్‌పల్లిలోని ఆదిత్య కన్వెన్షన్‌హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యమ్రంలో నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల తర్వాత పూర్వవిద్యార్థులంతా ఒకచోట కలుసుకోవడాన్ని మించిన ఆనందం ఇంకోకటి లేదని స్కూల్లో చదువుకునే రోజుల్లో జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటే ఆ మధురానుభూతులే వేరు అంటూ మాట్లాడిన తీరు ఆనందభాష్పాలను కలిగించిందని అన్నారు. అంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. విందు వినోదాలతో సాయంత్రం వరకు సందిడిగా గడిపారు. ఈ కార్యమ్రంలో ఉపాధ్యాయులు కొప్పు జంగయ్య రాఘవచారి లక్ష్మారెడ్డి వేణు నవరత్నం గోవింద్ చిల్లాల్ దూస జంగయ్య రాఘవులు పూర్వ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనా న్నరు.

## కొల్చారంలో ఘనంగా బోనాల పండుగ ఉత్సవాలు



గ్రామ దేవతలకు బోనాలను ఊరేగింపు తీసుకెళ్తున్న మహిళలు

**కొల్చారం, జూలై28 ప్రభాతవార్త:** పోతరాజుల గావుకేకలు.. శివసత్తుల పూనకాలు.. డప్పుచప్పుళ్లు.. యువకుల నృత్యాలతో కొల్చారం గ్రామ దద్దరిల్లింది. ఆదివారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలో బోనాల పండుగ అత్యంత భక్తి శ్రద్ధలతో కన్నుల పండుగలా జరిగింది. గ్రామంలోని పురవీధుల గుండా మహిళలు బోనాలను ఎత్తుకొని భారీగా భారీగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా శివసత్తుల పూనకాలు, పోతరాజుల గావుకేకలు, యువకుల కేరింతలు, నృత్యాలతో గ్రామం మారుమ్రోగింది. అనంతరం మహిళలు గ్రామ దేవతలైన దుర్గమ్మ, పోచమ్మల ఆలయాల చుట్టూ బోనాలను ఎత్తుకొని ప్రదక్షిణలు చేసి దుర్గమ్మ, పోచమ్మలకు బోనాలను, నైవేద్యాలను సమర్పించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురవాలని దుర్గమ్మ, పోచమ్మలకు మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు తదితరులు ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణ కోసం ఆగస్టు 6న ఛలో ఢిల్లీ



కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నంగునూర్, జూలై 28, ప్రభాతవార్త :** ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6 ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతదని ఎమ్మార్పీఎస్ టిఎస్ జిల్లా అధ్యక్షులు భూమిగారి రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇంచార్జి దేవులపల్లి రాజేందర్ అన్నారు. నంగునూర్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఛలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాన్ని అవిష్కరించారు. బిజెపి అధికారంలోకి రాగానే వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రధాని మోడీ హామీ ఇచ్చి యేండ్లు గడుస్తున్న అమలు మాత్రం చేయడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగితేనే మాదిగలకు, మాదిగ ఉప కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఛలో ఢిల్లీ కార్యక్రమానికి మాదిగి, మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టిఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు గద్దం వెంకటేష్, దేవులపల్లి బొక్కల రాజు, దేవులపల్లి కృష్ణ, దేవులపల్లి కనకయ్య, సుంచు తిరుపతి, బెజ్జంకి సంజీవ్, భూమిగారి విజయ్, చిలుక శోభన్,దేవులపల్లి కరుణాకర్, సాయిలు,బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణనగర్ కాలనీలో పద్మశాలీల బోనాలు

**సదాశివపేట, జులై 28, ప్రభాతవార్త:** పట్టణంలోని కృష్ణనగర్ కాలనీలో ఆశాడ మాసాన్ని పురస్కరించుకుని పద్మశాలీలు సామూహికంగా అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకుయి అమ్మవారికి నివేదించారు. కార్యక్రమంలో అధ్యక్షులు వేణుమాధవ్, నాగుల విజయకుమార్, బూస శేఖర్, గౌరవ అధ్యక్షులు రుద్ర లక్ష్మణ్, ఉపాధ్యక్షులు సురేందర్, ప్రధాన కార్యదర్శి వొగ్గు గణేష్, కోశాధికారి ఆలె రాజు, పి రవి, సభ్యులు కనకరాజు, ప్రసాద్, నర్సింలు, సంగ్రామ్ తదితరులు పాల్గొన్నారు.



## మండల భజరంగ్‌దళ్, విహెచ్‌పి అధ్యక్షులుగా ఎగ్గిడి అనిల్

**కందుకూరు, జులై 28, ప్రభాతవార్త:** విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ కందుకూరు ప్రఖండ నూతన కమిటీ అధ్యక్షులుగా ఎగ్గిడి అనిల్‌కుమార్ ను నియమిస్తు జిల్లా కమిటీ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సొకుట్ల శ్రీనివాస్, మరియు మండల రాజుల అద్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షులు అనిల్‌కుమార్ అధ్యక్షతన పూర్తిస్తాయి కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విశ్వహిందు పరిషత్, భజరంగ్ దళ్‌ని విస్తరించడంలో కమిటీలు మార్గదర్శకంగానిలవాలని, హిందు దర్మ పరిరక్షనకోసం సంస్కృతిసాంప్రదాయాలను కాపాడుటలోనుహిందూ దేవాలయాల పరిరక్షనకోసం హిందువులను ఐఖ్యతగా నిలపడానికి చైతన్యం చేయాలని సూచించారు. ఈ సందర్భంగాకమిటీ ఉపాధ్యక్షులుగా అక్కనపల్లి నవీన్, ప్రధానకార్యదర్శిగా మాదరమోని సురేష్, భజరంగ్‌దళ్ సంయోజక్‌గా అయిల్ల దినేష్‌లను నియమించారు. ఈ క్యాక్రమంలో భజరంత్‌దళ్ జిల్లా సంయోజక్ ఎర్ర రాఘవేందర్, జిల్లా సహసంయోజక్ మండల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## నరసింహారెడ్డికి ఘన నివాళి



కొమురవెల్లిలో నరసింహారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు భూస్వాముల కబంధహస్తల నుంచి పీడిత ప్రజలను విముక్తి చేసిన కమ్యూనిస్టు నాయకులు,జనగామ మాజీ ఎమ్మెల్యే ఏసీ రెడ్డి నరసింహారెడ్డి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ అన్నారు. అదివారం ఏసీ నరసింహారెడ్డి 33వ వర్ధంతి సభను సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజా సమస్యల కోసం అయన నిరంతరం పోరాటం చేశారని తెలిపారు. నమ్మిన సిద్దాంతం, కష్టజీవుల రాజ్యం కోసం ఎత్తిన ఎర్రజెండాదించకుండా పోరాటం చేశారని గుర్తు చేశారు. ఏసీ రెడ్డి నరసింహారెడ్డిని స్పూర్తిగా తీసుకొని ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాముని గోపాలస్వామి, చొప్పరి రవికుమార్,దాసరి ప్రశాంత్, కొండం సంజీవ్, చెప్యాల బాలమణి, వంగ రవీందర్‌రెడ్డి, తాడిశెట్టి అంజనేయులు,అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

### కొమురవెల్లిలో.....

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు,జనగామ మాజీ ఎమ్మెల్యే ఏసీ రెడ్డి నరసింహారెడ్డి తుది శ్వాస విడిచే వరకు ఎత్తిన ఎర్రజెండాను విడవకుండా జీవితమంతా నిరాడబంరంగా ప్రజా సేవకు అంకితమైన కమ్యూనిస్టు యోధులని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. సీపీఎం మండల కార్యాలయంలో అదివారం ఏసీరెడ్డి నరసింహారెడ్డి 33వ వరన్థంతి సందర్భంగా అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నరసింహారెడ్డి జీవితం స్పూర్తిదాయకమన్నారు. రైతాంగాన్ని, పేదలను ఐక్యం చేసి అనుక్షణం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపించేవారని తెలిపారు. ఏసీ రెడ్డి నరసింహారెడ్డి స్పూర్తితో నేటీ పాలకులు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. అయన జీవితం నేటి పాలకులకు, యువతకు అదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బద్దిపడగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, సాయిలు, బాలకిషన్, బాలరాజు ,రవీందర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు వెంటనే పూర్తి చేసి ఇబ్బందులు తప్పించాలి



గుంతలమయంగా మారిన రోడ్డు బురదలో నిరసన వ్యక్తం చేస్తున్న చిన్నకోడూరు రైతులు

**చిన్నకోడూరు, జూలై 28, ప్రభాతవార్త :** సిద్దిపేట నుంచి ఇల్లంతకుంట వరకు చేపట్టిన నాలుగు వరసుల రోడ్డు పనులను ప్రారంభించి యేడాది కావస్తున్న నేటి వరకు పూర్తి చేయకపోవడంతో గత పది రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చిన్నకోడూరు మండల కేంద్రంలో రోడ్డు గుంతలుగా మారి వర్షపు నీరు నిలవడంతో పాటు పూర్తిగా బురదమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు, బాటసారులు, వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు గుంతల మయం కావడంతో ఈ రహదారి గుండా చౌడారం, మైలారం, అల్లీపూర్, కిష్టాపూర్, ఇల్లంతకుంట గ్రామాలకు వెళ్లే ప్రయాణీకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు వాపోతున్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో రైతులు ఈ రోడ్డు గుండా వ్యవసాయ బావుల వద్దకు వెళ్లలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డుపై ఎర్పడిన గుంతల్లోని బురదలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. రోడ్డు పనులు పూర్తి చేయకుంటే రైతులమంతా కలిసి ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో తాళ్లపల్లి సత్తయ్య,గొల్లపల్లి చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అనిల్, కృష్ణ, కర్ణాకర్‌రెడ్డి, రాజశేఖర్, మన్నె అనంద్, ప్రయాణీకులు, రైతులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

**కొల్చారం, జూలై28 ప్రభాతవార్త:** జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ నాయకురాలు చిలుముల సుహాసిని రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కిష్టాపూర్ పీఏసీఎస్ చైర్మన్ నాగులగారి మల్లేశంగౌడ్‌లు ఆదివారం కిష్టాపూర్ గ్రామంలో ఆదివారం మరణించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పీఏసీఎస్ డైరెక్టర్ ఎరుకల ముత్తయ్య పార్థీవ దేహానికి పార్టీ కండువా కప్పి, పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీ ఎళ్లవేళలా అండగా ఉంటుందని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు పెద్ద శ్రీశైలం, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తోష్యా నవీన్, పీఏసీఎస్ డైరెక్టర్లు అక్కెం శ్రీనివాస్, పసల సత్యనారాయణ, ఎంబరి శేఖర్, పసుల నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోళ్ల సత్యం, పెద్దల కిషన్, వెల్కకన్నె యాదగిరి, ఎంబరి మల్లేశం, మాజీ సర్పంచి గోదావరి, మాజీ పీఏసీఎస్ చైర్మన్, బీజేపీ యూత్ కమిటీ అధ్యక్షులు ఎంచర్ల శేఖర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## పట్టణ సిఐగా శివలింగం బాధ్యత స్వీకరణ

**జహీరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణ సిఐగా ఎస్ శివలింగం శనివారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు ఠాణాకు చేరుకున్న శివలింగంను ఎస్ఐ కాశీనాథ్ ఘనంగా స్వాగతం పలికారు. సంగారెడ్డి స్పెషల్ బ్రాంచి సిఐగా విధులు నిర్వహిస్తున్న శివలింగంను జహీరాబాద్‌కు బదిలీ చేయడంతో శివలింగం శనివారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు పట్టణ సిఐగా విధులు నిర్వహించిన రవిని హైద్రాబాద్ రేంజ్ ఉత్తర్వుల బదిలీ చేశారు. పట్టణ సిఐగా బాధ్యతలు స్వీకరించిన శివలింగం గతంలో జహీరాబాద్ ఎస్ఐగా విధులు నిర్వహించి ఉన్నారు. ఇదిలా ఉండగా జహీరాబాద్ రూరల్ సిఐగా జక్కుల హనుమంతు హద్నూర్ సిఐ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.



శామీర్‌పేటలోని రేషన్‌షాపును సందర్శించిన కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖ అధికారులు,పాల్గొన్న జిల్లా సంబందిత అధికారుల దృశ్యం

## రేషన్‌షాపును సందర్శించిన కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖ అధికారులు

**శామీర్‌పేట, జూలై 28, ప్రభాతవార్త** శామీర్‌పేటలోని రేషన్‌షాపును కేంద్ర ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల,ఆహారం ప్రజాపంపిణీ మంత్రిత్వశాఖ అధికారులు సందర్శించారు. ఆదివారం మండల కేంద్రమైన శామీర్‌పేట గ్రామంలోని రేషన్‌షాపును కేంద్ర ప్రభుత్వ సంబంధిత అధికారులు విచ్చేసి పరిశీలించారు. రేషన్ పంపిణీ విషయంపై డీలర్ అనురాధ ఓంప్రకాశ్‌ను అడిగి తెలుసుకున్నారు. రేషన్ బియ్యం పంపిణీ విషయంపై వారు ఆరా తీశారు. రేషన్‌షాపులో స్టాక్‌ను, రికార్డులను, రేషన్ పంపిణీ రిజిష్టర్స్‌ను వారు తనిఖీలు చేశారు. ప్రజలు రేషన్ తీసుకుంటున్న విధానాలను వారు డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. రేషన్‌షాపును సందర్శించి తనిఖీలు చేసిన వారిలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో పాటు జిల్లా సహాయ పౌరసరఫరాల అధికారి వి.బాల్‌రాజు, డిప్యూటీ తహసీల్దార్ శీనయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయ సిబ్బంది, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో అందరూ సమానమే: సీఐ సైదులు



అంబేద్కర్‌కు నివాళులు అర్పించి ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ సైదులు, అరుణ్‌కుమార్ తదితరులు

**ఘట్‌కేసర్, జూలై 28, ప్రభాతవార్త:** అంటరాని తనం, అస్పృశ్యత నిర్మూలనకు అంబేద్కర్ జీవితాంతం పోరాట ం చేశారని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదులు అన్నారు. ఘట్‌కేసర్ పట్టణంలో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 172 వ వారం నిత్య పూజల మాల కార్యక్రమం నిర్వహించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదులు ముఖ్యఅతిధిగా విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలనన్నారు. అంబేద్కర్‌తోనే భారత దేశం ప్రపంచంలోనే అత్యంత ప్రజాస్వామిక దేశంగా పేరు తెచ్చుకుందని, సమాజంలో అందరూ సమానమేనని ఎవరు తక్కువ కాదనే భావనతో అందరికి ఓటు హక్కు కల్పించారని కొనియాడారు. అనంతరం రాజ్యంగపీఠికపై అందరూ ప్రమాణం చేశారు. స్వాతంత్ర సమర యోధుడు షహీద్ ఉద్దమ్ సింగ్ 84వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాళ వేసి శ్రద్ధాంజలి ఘటించి ఆయన జీవిత చరిత్రను వివరించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ మేకల దాసు, మండల టిడిపి అధ్యక్షులు వేముల సంజీవగౌడ్, అంబేద్కర్ యు.సం ప్రధాన కార్యదర్శి ఇరిటం శ్రీనివాస్, నాయకులు ఆముద బాల్‌రాజ్, బండారు రాందాసు, రామకృష్ణయాదవ్, పొట్లచెరువు నారాయణ, మద్ది రవిగౌడ్, కె.నర్సింగ్‌రావు, మీసాల రాజేశ్‌కుమార్, మేకల నర్సింగ్‌రావు, కె.సత్యం, ఎ.రామకృష్ణ, రూపేష్‌కుమార్, ఎస్.కృష్ణంరాజు, సి.ఆనంద్, డి.శ్రీనాథ్, సి.నిఖిల్, సి.ఉపే ందర్, ఈ.విష్ణు, జి.సచిన్, డి.భరత్, జి.ప్రవీణ్, జె.అఖిల్, జె.సాయిచరణ్, బి.వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జగదాంబమాత, సేవాలాల్‌మహారాజ్ పూజలు



ఫకీర్‌టెక్యాలో భోగ్-భండార్ కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్‌గౌడ్, తండా నాయకులు

**ఘట్‌కేసర్, జూలై 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఘణాపూర్ అనుబంధ గ్రామం ఫకీర్‌టెక్యాలో ఆదివారం శ్రీజగదాంబమాత, శ్రీసేవాలాల్ మహారాజ్ జెండా పూజ భోగ్-భండార్ కార్యక్రమం ఘనంగా జరిగింది. తండాలో కొలువై ఉన్న ఆలయంలో అమ్మవారికి, స్వామిలకు జెండా ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. తండా ప్రజల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా కాంగ్రెస్‌పార్టీ మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ విచ్చేసి జగదాంబ మాత అమ్మవారిని, సేవాలాల్ మహారాజ్‌లను దర్శించుకొని భోగ్-భండార్‌లో పాల్గొనా న్నరు. ఈసందర్భంగా బోనాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈకార్యక్రమంలో తండా నాయక్ వడ్త్య రాజునాయక్, కారోబారి నానావత్ హూస్సేనానాయక్, పూజారి రామావత్ అమర్‌సింగ్, తండా నాయకులు వడ్యా జయంధర్‌నాయక్, మేడ్చల్ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు నానావత్ సురేశ్‌నాయక్, మాజీ వార్డుసభ్యులు వడ్యా చాందీనాయక్, రామావత్ రాణి, వడ్య పవన్‌నాయక్, జిల్లా ఎన్ఎస్‌యుఐ కార్యదర్శి నానవత్ శివాజీనాయక్, నాయకులు రామావత్ చందర్‌సింగ్, వడ్త్య సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు స్థానికులకే ఇవ్వాలి



వెంకటాపూర్‌లో పేదలతో మాట్లాడుతున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జూలై 28, ప్రభాతవార్త:** డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను కేటాయించకుండా కాంగ్రెస్ సర్కార్ కాలయాపన చేస్తుందని మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి విమరి ్శంచారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లో ఆదివారం ఆయన పేదమహిళలతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానికేతరులైన అనర్హు లకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించి మోసం చేసిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి కనీస చొరవ చూపడం లేదని, ఓట్లేసి ప్రజలు గెలిపిస్తే వారి సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని పేదలకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. మండలంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను స్థానికులకు కేటాయించాలని గతంలో ఉద్యమాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకుల మాదిరిగా వ్యవహరించకుండా పరిశీలించి అర్హులైన స్థానిక పేదమహిళలకు ఇవ్వాలన్నారు. స్థానికులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలనే డిమాండ్‌తో బిజెపి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముట్టడి ద్వారా ధర్నా చేసి ఆందోళనను మరింత ఉద ృతం చేస్తామని మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి స ్పష్టం చేశారు. మాజీ ఎంపిటిసి నిరుడి రామారావు, గ్రామ బిజెపి కార్యదర్శి వినోద్ ముదిరాజ్, మేడ్చల్ రూరల్ జిల్లా బిజెవైఎం కార్యదర్శి కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌గౌడ్, యాదగిరి, మహిళలు పాల్గొన్నారు.



## చిలకలగూడలో ఘనంగా బోనాలు

**సికింద్రాబాద్, జూలై 28 ప్రభాతవార్త:** చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం అర్ధరాత్రినుంచే భక్తులు రావడం ప్రారంభించడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్నిఏర్పాట్లు జరిపారు. బోనం సమర్పించడానికి మహిళా భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. అమ్మవార్లకు బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్ల దర్శనం చేసుకోడానికి భక్తులు క్యూలు కట్టారు. ఆలయం లోపలు నిర్వాహకులు సరైన క్యూ పాటిండానికి ఏర్పాట్లు సక్రమంగా జరుపక పోవడంతో వెలుపల నుంచి వచ్చే భక్తులు నేరుగా అమ్మవార్లను దర్శించుకోడానికి వెళుతుండడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. డప్పు వాయిద్యా లకు లయబద్ధంగా పోతరాజులు నృత్యాలు చేస్తు ఆలయానికి చేరుకున్నారు.

**అమ్మవార్లను దర్శించుకున్న నేతలు....**

చిలకలగూడలోని కట్టమైసమ్మ, నల్లపోచమ్మ అమ్మవార్లను పలువురు నేతలు దర్శించుకున్నారు. మంత్రి కొండ సురేఖ అమ్మవార్లకు బోనం సమర్పించు కొని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్, కార్పొరేటర్‌లు సామలహేమ, కంది శైలజ, కాంగ్రెస్ నాయకుడు ఆదం సంతోష్‌కుమార్, గంటా రాజుసాగర్ ఇతర నేతలు దర్శించుకొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు.

## తల్లిని గౌరవిస్తే దేవతలను పూజించినట్టే : దామోదర్ గుప్తా

**నాంపల్లి, జూలై 28 ప్రభాతవార్త :** అమ్మవారికి నైవేద్యం పెడతాం.... ప్రార్థిస్తాం... ఆమె కరుణా కటాక్షాలు అందరిపై ప్రసరించాలని కోరుతూ ఉంటాము కానీ ముందుగా మన ఇంట్లోని కన్నతల్లిలో అమ్మవారిని చూసుకొని గౌరవిస్తే ఆ దేవతలను పూజించినట్లేనని, అమ్మవారు తప్పక కరుణిస్తారని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా తెలిపారు. అలాగే గురుపూర్ణమ సందర్భంగా మన అభ్యుదయం, ఉన్నతికి మూలకారకులైన గురువులను కూడా గౌరవిద్దామని పిలుపునిచ్చారు. బోనాలు, బతుకమ్మ తెలంగాణలో సామాజిక పండుగలు ఉత్సవాలని, బోన మంటే తరతరాలు ఆనవాయితీగా వస్తున్నది అమ్మవారికి పెట్టే నైవేద్యమని, ప్రజలు అన్నివిధాలా సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించడమేనని అన్నారు. ఇంతమంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కె.వి.రమణారావును సేవలను శ్లాఘిం చారు. కళాకారుల తల్లిదండ్రులను అభినందించారు. లయన్ కె.వి.రమణారావు స్వాగతోపన్యాసంలో నేటి వేడుకలు జనజాతరను తలపిస్తున్నాయని, ఒకపక్క బోనాల ఆటపాటల భక్తిరస ప్రదర్శనలు, మరోపక్క గురుదేవుల శిష్యుల కళా ప్రదర్శనలు హోరెత్తించి మైమరపించాయన్నారు. జైజవాన్ జైకిసాన్ జైకళాకార్ సంస్థ ఆధ్వర్యంలో బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కె.వి.రమణాచారి నిర్వహణలో వైభవోపేతంగా జరిగిన ప్రతిష్టాత్మక తెలంగాణ బోనాలు, గురుపౌర్ణమి వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోలేటి దామోదర్‌గుప్తా ఆత్మీయ అతిథులు ఎ.రఘునందన్, శ్రీనివాస్‌శర్మ, వి.విజయ కుమార్, ప్రత్యేక అతిథులు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతలు డా. వేదాంతం రాధేశ్యామ్; యక్షకంఠీరవ డా. పసుమర్తి శేషుబాబు; ప్రముఖ నటులు సునామీ సుధాకర్; చంద్రశేఖర్ రాథోడ్ తదితరులతో కలిసి ముందుగా ప్రత్యేక అతిథులను లెజెండరీవింగ్‌లో భారత్ వరల్డ్ రికార్డ్స్ నమోదుపత్రం, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.



# కల్పవల్లి.. కరుణించు తల్లీ !

**బోనమెత్తిన భాగ్యనగరం.. లాల్‌దర్వాజ బోనాలు..భారీగా తరలివచ్చిన భక్తులు**

**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన డిప్యూటీ సీఎం మల్లు బట్టివిక్రమార్క**

**సింహవాహిని మాతా మహంకాళి ఆలయంలో ఘనంగా బోనాల వేడుకలు**





**హైదరాబాద్, జూలై 28 ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల వేడుకలు ఆదివారం హైదరాబాద్‌లో వైభవంగా జరిగాయి. భాగ్యనగరంలో ఆధ్యాత్మికతను ద్విగుణీకృతం చేశాయి. పాతబస్తీతో పాటు సిటీలో వాడవాడలా వేడుకలు ఉత్సాహంగా సాగాయి. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకఉలు దేవాలయాలకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఏ వీధి చూసినా సందడి సందడిగా కనిపించింది. చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం, లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి, మీరాలంమండి శ్రీమహంకాళేశ్వర, సుల్తాన్‌షాహీ జగదాంబ, అక్కన్న మాదన్న, బేలా మతేశ్వరి ముత్యాలమ్మ, గౌలిపురా కోట మైసమ్మ, ఉప్పుగూడ మహంకాళి, హరిబౌలి బంగారు మైసమ్మ, అంబర్‌పేట మహంకాళి ఆలయాలకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆషాఢమాసం చివరి ఆదివారం పాతబస్తీలో లాల్‌దర్వాజా సింహవాహినీ అమ్మవారి బోనాల ఉత్సవం కన్నులపండువగా జరిగాయి. తెల్లవారు జాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించుకున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల జాతరకు ప్రభుత్వం 20 కోట్లు కేటాయించిందని అన్నారు. 10 వేల కోట్లు నగర అభివృద్ధికి కేటాయంచిందని అన్నారు. నగర అభివృద్ధికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డు వేసిందన్నారు. బోనాల పండుగ భూమి పుత్రులపండుగ అని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని కోరే పండుగ అన్నారు. నగర ప్రజలను లాల్ దర్వాజ్ మహంకాళి అమ్మవారు కాపాడుతున్నారని తెలిపారు.

మరోవైపు నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం బోనాలతో సందడి నెలకొంది. చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి అమ్మవారికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలాగే పాతబస్తీలో 16 ఉమ్మడి దేవాలయాల్లో భక్తులు పెద్దఎత్తున రావడంతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. గౌలిపురలోని ముత్యాలమ్మ టెంపుల్ (భారత మాత మహంకాళి మందిరం), దూద్‌బౌలి పయనీర్ ముత్యాలమ్మ టెంపుల్‌లో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భాగ్యలక్ష్మి టెంపుల్, అక్కన్న మాదన్న మహంకాళి మందిరం, మిరాలంమండిలోని మహంకాళీశ్వర ఆలయాలకు భక్తుల తాకిడి తీవ్రంగా కనిపిం చింది. అంబర్‌పేట మహంకాళి ఆలయంలో విఐపీ తాకిడి ఎక్కువ కావడంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ ఎంపి వి.హనుమంతరావు, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బిఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని శాలువతో సత్కరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.













## నేడు మాతేశ్వరీ మహంకాళి అమ్మవారి ఘటాల ఊరేగింపు

**చాంద్రాయణగుట్ట, జూలై 28 ప్రభాతవార్త :** పాతబస్తీలో బోనాల ఉత్సవాల అనంతరం చివరి రోజు సోమవారం భాగ్యనగర్ శ్రీమహంకాళి బోనాల జాతర ఉత్సవాల ఉమ్మడి దేవాయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో మాతేశ్వరి అమ్మవారి ఘటాల ఊరేగింపు కొనసాగనుంది. మధ్యాహ్నం లాల్‌దర్వాజ సింహవాహిణి మహంకాళి ఆలయం, ఉప్పుగూడ మాతేశ్వరి మహంకాళి ఆలయం, హరిబౌలి అక్కనమాదన్న మహంకాళి ఆలయం, మిరాలంమండి మాతేశ్వరిఆలయంలో భవిష్యవాణి వినిపించే కార్యక్రమం అనంతరం ఘటాల ఊరేగింపు కొనసాగనుంది. హరిబౌలి శ్రీఅక్కన్నమాదన్న మహంకాళి ఆలయం అమ్మవారి ఘటం ఊరేగింపు ఏనుగు అంబారీపై ఊరేగనుంది. ఈ ఊరేగింపును నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ప్రారంభిస్తారు. ఊరేగింపు కొనసాగే ప్రధానమైన లాల్‌దర్వాజ, శాలిబండా, చార్మినార్, మదీనా సర్కిల్, నయాపూర్ ఢిల్లీ దర్వాజ వరకు కొనసాగుతుంది.

### నేడు మాతేశ్వరీ మహంకాళి అమ్మవారి ఘటాల ఊరేగింపు

**చాంద్రాయణగుట్ట, జూలై 28 ప్రభాతవార్త :** పాతబస్తీలో బోనాల ఉత్సవాల అనంతరం చివరి రోజు సోమవారం భాగ్యనగర్ శ్రీ మహంకాళి బోనాల జాతర ఉత్సవాల ఉమ్మడి దేవాయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో మాతేశ్వరి అమ్మవారి ఘటాల ఊరేగింపు అత్యంత వైభవంగా కొనసాగనుంది. మధ్యాహ్నం లాల్‌దర్వాజ సింహవాహిణి మహంకాళి ఆలయం, ఉప్పుగూడ మాతేశ్వరి మహంకాళి ఆలయం, హరిబౌలి అక్కనమాదన్న మహంకాళి ఆలయం, మిరాలం మండి మాతేశ్వరి ఆలయంలో భవిష్యవాణి వినిపించే కార్యక్రమం అనంతరం ఘటాల ఊరేగింపు కొనసాగనుంది. హరిబౌలి శ్రీ అక్కన్నమాదన్న మహంకాళి ఆలయం అమ్మవారి ఘటం ఊరేగింపు ఏనుగు అంబారీపై ఊరేగనుంది. ఈ ఊరేగింపును నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి ప్రారంభిస్తారు. ఊరేగింపు కొనసాగే ప్రధానమైన లాల్‌దర్వాజ, శాలిబండా, చార్మినార్, మదీనా సర్కిల్, నయాపూర్ ఢిల్లీ దర్వాజ వరకు కొనసాగుతుంది. ఊరేగింపు మార్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## గంజాయి విక్రేత అరెస్ట్

**300 గ్రాముల డ్రై గంజాయి స్వాధీనం**

**పంజగుట్ట, జూలై 27 (ప్రభాతవార్త):** గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం మిషన్ ధూల్‌పేట పేరుతో ఇటీవల తెలంగాణ పోలీసులు నిఘాపెట్టి ఏకంగా ధూల్‌పేట నుండి జూబ్లీహిల్స్, వెంకటగిరి ఇతర ప్రాంతాలకు గంజాయి సరఫరా జోరుగా సాగుతోంది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం వెంకటగిరికి చెందిన చల్లా వినయ్‌కుమార్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తుంటాడు. వినయ్‌కుమారు ధూల్‌పేట నుంచి డ్రై గంజాయి తీసుకువచ్చి వెంకటగిరిలో అమ్మకాలు సాగిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు హైదంబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జూబ్లీహిల్స్ ఎక్సయిజ్ అధికారులు కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని అతని నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వెంటనే వినయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్ల శాతం పెంచాలి

**సైఫాబాద్, జులై 28 ప్రభాతవార్త:** గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానం ప్రకారం పంచాయితీరాజ్ ఎన్నికల్లో బిసిల రిజర్వేషన్‌ల శాతాన్ని 22 నుంచి 42కు పెంచాలని, లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేసి రాష్ట్రాని స్తంభింపజేస్తామని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 14 బిసి సంఘాలు, 22 బిసి కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం జనాభా లెక్కలు తీయకుండా రిజర్వేషన్‌లు పెంచకుండా పాత పద్ధతిలో 20 శాతం రిజర్వేషన్‌లతో ఎన్నికలు జరపడానికి కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. ముఖ్య మంత్రులు, రాష్ట్రమంత్రులుగా అగ్రకులాలే ఉంటున్నారని, ఇంతవరకు బిసిలకు ముఖ్యమంత్రి పదవి దక్కలేదని, మేజారిటి కార్పొరేషన్‌ల ఛైర్మన్‌లుగా అగ్రకులాలవారే ఉన్నారని ఆరోపించారు. కనీసం బిసిలకు సర్పంచ్ పదవులు కూడా ఇవ్వారా?, ఇదెక్కడి న్యాయమని, కామారెడ్డిలో 42 శాతంకు పెంచుతామని ప్రకటించారని, ఆ డిక్లరేషన్ ఏమైందని? ఆయన ప్రశ్నించారు. ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం కులాలవారిగా లెక్కలు సేకరించి పంచాయితీరాజ్ రిజర్వేషన్‌లను 42 శాతంకు పెంచాలని, ఈ మేరకు ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ కులాల వారిగా లెక్కలు తీసి జనాభా ప్రకారం రిజర్వేషన్‌లు పెంచుతామని పలు బహిరంగ సభలో ప్రకటించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బిసిల రిజర్వేషన్‌లు పెంచితే సమస్యలు వస్తాయని సిఎం రేవంత్‌రెడ్డి శనివారం మంత్రులతో, అధికారులతో చర్చల్లో అన్నారని, సమగ్ర కులగణన చేసి దాని ప్రకారం రిజర్వేషన్‌లు పెంచితే న్యాయపరమైన, చట్టపరమైన అవరోధాలు ఉండవని ఆయన స్పష్టం చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఆనేక కేసులలో జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని తీర్పులు చెప్పిందని, ఉత్తరప్రదేశ్ కేసులో కులగణన చేసి రిజర్వేషన్లు పెంచితే అభ్యంతరం లేదని చెప్పిందని ఆయన తెలిపారు. అగ్రకులాలకు విద్యా, ఉద్యోగరంగాలలో 10 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడు, 50 శాతం సీలింగ్ కాలం చెల్లిన విధానమన్నారు. జనాభా ప్రకారం రిజర్వేషన్‌లు పెంచుకోవచ్చునని, తమిళనాడు రాష్ట్రంలో 69 శాతం రిజర్వేషన్‌లు కొనసాగతున్నాయని, బీహార్ రాష్ట్ర ప్రభుత్వం 60 శాతం రిజర్వేషన్‌లు బిసిలకు కల్పించిందని, తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల వాగ్దానం ప్రకారం రిజర్వేషన్‌లు పెంచాలంటే మొదట సమగ్ర జనగణనలో కులగణన చేయాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ లోక్‌సభలో బిసి రిజర్వేషన్‌లు పెంచుతూ ప్రైవేటు బిల్లు పెడితే అన్ని పార్టీల మద్దతు లభిస్తుందని, ఇందుకు రాహుల్ గాంధీ చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బిసి నేతలు ఎర్ర సత్యనారాయణ, గోరిగె మల్లేష్‌యాదవ్, సి.రాజేందర్, కృష్ణుడు, రాజ్‌కుమార్, జిల్లపల్లి అంజీ, పగిళ్ళ సతీష్ తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

## ఢిల్లీ వరదల్లో విషాదం

**నగర విద్యార్థినితో పాటు మరో ఇద్దరు మృతి**

**మృతురాలి కుటుంబానికి కేంద్ర మంత్రి పరామర్శ**

**అడ్డగుట్ట, జూలై 28, ప్రభాతవార్త:** కొద్ది రోజులుగా డిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా అక్కడ సివిల్స్‌కి శిక్షణ తీసుకుంటున్న సికింద్రాబాద్‌కు చెందిన విద్యార్థిని తానియా సోనీ(25) మృతిచెందిన ఘటన సర్వత్రా చర్చ నీయాంశ మైంది. దీనిపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి చెందారు.



మృతురాలి తండ్రి వినయ్‌కుమార్‌ను ఫోన్లో పరా మర్శిం చారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. డిల్లీ పోలీసులు, ఇతర అధికారులతో మాట్లాడారు. తానియా సోనీ మృత దేహానికి సంబంధించిన ఫార్మాలిటీలను పూర్తి చేసి త్వరగా హైదరాబాద్‌కు పంపే ఏర్పాట్లు చేయాలని డిల్లీలోని తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. ఏకధాటిగా కురుస్తున్న వానల వల్ల డిల్లీలోని కోచింగ్ సెంటర్‌లోకి భారీగా వరద నీరు పోటెత్తడంతో రాష్ట్రానికి చెందిన తానియా సోని(25) ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. రాజేంద్రనగర్ ప్రాంతంలోని రావ్ ఐఎఎస్ స్టడీ సర్కిల్ బిల్డింగ్‌లో వరదనీరు చేరింది. బేస్‌మెంట్‌లోని లైబ్రేరిలో ముగ్గురు విద్యార్థులు చదువుకుంటుండగా వేగంగా పారుతున్న వరదనీరు ఒక్కసారిగా ముంచెత్తింది. దాంతో ఎటూ వెళ్ళలేని స్థితిలో విద్యార్థులు తానియా సోనీ(25), శ్రేయా యాదవ్(25), నెవిన్ డాల్విన్(28)లు ఆ వరదలో చిక్కుకుని నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. అప్పటికే రంగంలోకి దిగిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టి మృతదేహాలను బయటకు తీశారు. వరదలో చిక్కుకున్న మరికొందరు విద్యార్థులను కాపాడి సురక్షితంగా బయటకు తీశారు.